క్లుప్తంగా

మాజీ సర్పంచ్ భర్త వెంకట్రామయ్యకు ఎమ్మెల్యే నివాళి

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు మాజీ సర్పంచ్ నాదెళ్ల రమాదేవి భర్త వెంకట్రామయ్య (69) అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బుధవారం వెంకట్రామయ్య మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పలువురు పార్టీ నాయకులు, అభిమానులు, గ్రామస్తులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

నేడు గంగాభవానీ అమ్మవారికి సారె

కోడూరు: కోడూరులోని గంగాభవానీ అమ్మవారికి గురువారం ఆషాఢ సారెను సమర్పించనున్నట్లు ధర్మకర్త కోట యుగంధరరావు బుధవారం తెలిపారు. ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామానికి చెందిన మహిళలు అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకువస్తారని తెలిపారు. ఉదయం 9గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని యుగంధరరావు కోరారు.

త్యాగాలకు ప్రతీక మొహర్రం



గూడూరు: ఆనాడు కర్బలా మైదానంలో హజ్రత్ ఇమాం హుస్సైన్ త్యాగనిరతికి ప్రతీకగా మొహర్రంను పురస్కరించుకుని మండలంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గూడూరులోని హజ్రత్ నాల్ సాహెబ్ ఆస్తానాలో జామియా మసీదు ఇమామ్ జమాల్ బేగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనల్లో ఆస్తానా కమిటీ సభ్యులు జహంగీర్‌బేగ్, నిర్గస్‌షా, నూరుల్లా, ఇద్రీస్, ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు షర్బత్ పంపిణీ చేశారు. పటాన్‌పేటలోని హజ్రత్ నిర్గస్‌షా ఔలియా దర్గాలో దర్గా కమిటీ చైర్మన్ మహ్మద్ యాసీన్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం మతగురువులు జునైద్ రజా, మొహ్మద్ రహీంల ఆధ్వర్యంలో దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పంజా సెంటర్‌లోని నకర్ అలీ ఆస్తానాలో కూడా ప్రార్థనలు నిర్వహించారు.

బాలికలపై అకృత్యాలకు అడ్డుకట్ట వేయాలి

ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్



చల్లపల్లి(అవనిగడ్డ): రాష్ట్ర వ్యాప్తంగా బాలికలపై జరుగుతున్న అకృత్యాలు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ అన్నారు. అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా సంఘ కార్యాలయంలో చల్లపల్లికి చెందిన మహిళా న్యాయవాది ఆరె దైవకృపను బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ భారతీయ న్యాయ సంహిత ద్వారా దేశంలో ఏర్పడిన కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా న్యాయవాదులు చొరవచూపాలన్నారు. ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో ఏర్పడిన భారతీయ న్యాయ సంహిత ద్వారా సంక్రమించిన పలు సెక్షన్లపై ప్రజలకు కనీస అవగాహన ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బాలికలపై జరుగుతున్న అకృత్యాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, అకృత్యాల్లో బాలురు నిందితులుగా ఉండే సంఘటనలు మరింత కలవరపరుస్తున్నాయన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలాల్లో చట్టాలు, శిక్షల గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి న్యాయవాదులు సామాజిక బాధ్యతతో చొరవ తీసుకోవాలని కోరారు. వారంలో ఒకరోజు కొంత సమయం విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలకు కేటాయించాలని న్యాయవాదులను సురేష్ కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మేడేపల్లి సుబ్బారావు, కర్రా లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వీఎన్ పురం కాలనీలో కలుషిత నీరు సరఫరా

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు వెంకటనరసింహాపురం కాలనీలో గ్రామపంచాయతీ సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితమవుతుంది. డ్రెయిన్ల కింద ఉన్న పైపులైన్ లీకేజీ కారణంగా తాగునీటిలో మురుగు నీరు కలుస్తున్నాయని కాలనీవాసులు చెబుతున్నారు. దీనివల్ల కుళాయిల్లో దుర్వాసనతో కూడిన నురగలు కక్కుతున్న నలుపు రంగులో నీరు వస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి తాగునీటి పైపులైన్ లీకేజీల అరికట్టేందుకు తక్షణ మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. లేకపోతే డయేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



నదుల నుంచి తీసుకువచ్చిన జలాలను ఆలయం చుట్టూ ఊరేగిస్తున్న పండితులు, భక్తులు

కోడూరు: మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల పరిధిలో తొలి ఏకాదశి, అమ్మవార్లకు సారె సమర్పణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోడూరు మండలం ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామి దేవాలయం తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఆలయంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అష్టాక్షరీ పీఠాధిపతి, ఆలయ నిర్మాణకర్త త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ పర్యవేక్షణలో ఉదయం ఉత్సవమూర్తులకు తిరుమంజన సేవ భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అనంతరం వివిధ నదుల నుంచి తీసుకువచ్చిన జలాలను 108 కలశాలలో ఉంచి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అష్టోతర శతకలశ క్షీరాభిషేకాన్ని కనులపండువగా నిర్వహించారు. పూజలు చేసిన జలాలతో శ్రీమన్నారాయణుడి 11 అడుగుల మూలమూర్తికి అభిషేకాలను శాస్త్రోక్తంగా చేశారు. అష్టాక్షరీ స్వామిజీ భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. అష్టాక్షరీ బృందావనం స్వామిజీ కూడా ఈ పూజల్లో పాల్గొన్నారు. అభిషేకాలనంతరం స్వామివారి మూలమూర్తిని విశేష అలంకారంలో భక్తులకు దర్శనమందించారు.

ఏకాహం ప్రారంభం..

అష్టభుజ మండపంలో భక్తమండళ్ల సభ్యులు విష్ణు సహస్రనామ పారాయణ ఏకాహాన్ని ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తమండళ్లు శ్రీమన్నారాయణుడి చిత్రపటాన్ని ఏకాదశి మండపంలో నెలకొల్పారు. గురువారం ఉదయం 8గంటలకు ప్రత్యేక హారతులు ఇచ్చి పారాయణాన్ని ముగించనున్నట్లు అష్టాక్షరీ స్వామిజీ చెప్పారు. కర్నూలు, నకిరేకల్లు, బెంగుళూరు, మచిలీపట్నం, విజయవాడ, హైదరాబాద్ నుంచి భక్త మండళ్ల సభ్యులు తరలివచ్చారు.

ఉత్సవమూర్తుల ఊరేగింపు..

గ్రామ పురవీధుల వెంట స్వామివార్ల ఊరేగింపు జరగ్గా, గ్రామస్తులు హారతులు పట్టి స్వాగతం పలికారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. రాత్రికి స్వామివార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. గురువారం శ్రీపుష్పయాగాన్ని జరపనున్నట్లు చెప్పారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గణపేశ్వరం(నాగాయలంక): ఆషాఢమాసం, తొలిఏకాదశి పురస్కరించుకుని గణపేశ్వరం గ్రామంలోని నలుగురు అమ్మవార్లకు గ్రామస్తులు, శ్రీకనకదుర్గ భక్తసమాజం ఆధ్వర్యంలో బుధవారం ఆషాఢ సారె సమర్పణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీకనకదుర్గమ్మవారు, శ్రీలక్ష్మీతిరుపతమ్మలతో పాటు గ్రామ దేవతలు గంగానమ్మ, అంకమ్మతల్లికి గ్రామస్తులు, భక్త సమాజం సభ్యులు ఆషాఢ సారెను సంప్రదాయబద్ధంగా సమర్పించారు. సమాజం కన్వీనర్ పిరాటి శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పెదకళ్లేపల్లి పడమర వీధిలో అర్జా వారి ఆడపడుచు అమ్మగారి తల్లికి ఆషాఢ మాసం సందర్భంగా బుధవారం పెద్ద ఎత్తున మహిళలు ఆషాఢ సారె సమర్పించుకున్నారు. ఉదయం అర్జా వారి ఆడపడుచులు తయారు చేసుకున్న పలురకాల పిండి వంటకాలు, పసుపు-కుంకుమ, పూలు, పండ్లు, పట్టు వస్త్రాలతో సామూహికంగా అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మగారి తల్లికి సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా అర్జావారి ఇంట పండుగ వాతావరణం నెలకొంది. బంధుమిత్రులతో గ్రామంలో సందడి చేశారు.

బంటుమిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న వైష్ణవాలయాల్లో తొలి ఏకాదశి సందర్భంగా పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం స్థానికంగా కొలువై ఉన్న పద్మావతీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి దేవాలయాలతో పాటు చోరంపూడి, మల్లేశ్వరం, ముంజులూరు, ఆర్తమూరు తదితర గ్రామాల్లో ఉన్న రామాలయాల్లో తొలి ఏకాదశిని పురస్కరించుకుని స్వామి వార్లకు విశేషపూజలు నిర్వహించారు. భక్తులకు పేలాలపిండి ప్రసాదంగా అందజేశారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో..

పెడన: పట్టణంలో శ్రీరుక్మిణీ సత్యభామాసమేత వేణుగోపాల స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారికి విశేష పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న వైష్ణవాలయాల్లో తొలి ఏకాదశి సందర్భంగా పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణం, మండలంలోని వివిధ గ్రామాల్లోని రామాలయాల్లోను, అభయాంజనేయ స్వామి ఆలయాల్లోనూ తొలి ఏకాదశిని పురస్కరించుకుని స్వామివార్లకు పూజలు చేసి, మొక్కజొన్న పిండి, పంచదార కలిపి ప్రసాదంగా అందజేశారు.

ఆంజనేయస్వామికి 1008 అరటి పండ్లతో పూజ

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఈడేపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి 1008 అరటి కాయలతో పూజలు చేశారు. గాజుల భూనాథ్, నిర్మల దంపతులతో పాటు పలువురు భక్తులు ఈ అరటి కాయల పూజలో పాల్గొన్నారు. తొలిఏకాదశి కావటంతో భక్తులు ఆలయానికి పోటెత్తారు.

కోడూరు: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మాచవరంలోని తుంగపల్లెమ్మ అమ్మవారికి బుధవారం భక్తులు ఆషాఢ సారెను సమర్పించి భక్తిభావం చాటుకున్నారు. మాచవరం గ్రామస్తులు స్థానిక ఆంజనేయస్వామివారి దేవాలయం వద్ద నుంచి సారెను ఊరేగింపుగా తీసుకువచ్చారు. సమరసతాసేవా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గూడూరు: తెలుగువారి మొదటి పర్వదినం తొలిఏకాదశిని మండలంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గూడూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మాధవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన దేవతా మూర్తులను భక్తులు విశేష పూజలు చేశారు. పేలాల పండుగగా ప్రసిద్ధి చెందిన తొలిఏకాదశి సందర్భంగా స్థానిక శ్రీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయాలు కళకళలాడాయి.

కృత్తివెన్ను: ఆషాఢ మాసంలో ముందుగా వచ్చే ఏకాదశి పర్వదినం బుధవారం భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. ఆలయాలలో ఉదయం నుంచి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. శ్రీమహావిష్ణువు యోగనిద్రకు ఉపక్రమించే రోజని, దీనిని శయన ఏకాదశి అని కూడా అంటారని పండితులు వివరించారు. భక్తుల తాకిడితో ఆలయాలు కిటకిటలాడాయి. సంప్రదాయబద్ధమైన కుడుములు, పేలాల పిండి భక్తులకు ప్రసాదంగా అందించారు.

అవనిగడ్డ: సమరసతా సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మాచవరం గ్రామంలోని శ్రీతుంగపల్లెమ్మ అమ్మవారికి గ్రామ మహిళలు, పెద్దలు ఆషాఢ మాసం సారె బుధవారం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీ అంకాలమ్మ తల్లి దేవస్థానం నుంచి భారీ ఊరేగింపుగా బయలుదేరిన మహిళలు, గ్రామ పెద్దలు శ్రీ తుంగపల్లెమ్మ అమ్మ వారికి సారె సమర్పించారు. అనంతరం సమరసత సేవా ఫౌండేషన్ మహిళా అధ్యక్షురాలు నాగరాజ కుమారి మాట్లాడుతూ ఆషాఢ మాసంలో 450 గ్రామాల్లో అనగా ఇంద్రకీలాద్రితో పాటు ఇతర గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.



గణపేశ్వరం దుర్గమ్మ ఆలయానికి ఆషాఢ సారెతో ఊరేగింపుగా వచ్చిన గ్రామస్తులు



అమ్మవారికి ఆషాఢ సారె సమర్పిస్తున్న అర్జా వారి ఆడపడుచులు



తుంగపల్లెమ్మ సారెను సమర్పించేందుకు ఊరేగింపుగా వస్తున్న భక్తులు



మాచవరంలో శ్రీతుంగపల్లెమ్మ అమ్మవారికి సారె ఇచ్చేందుకు వస్తున్న భక్తులు



అరటి పండ్లతో ఆంజనేయస్వామికి అలంకరణ

హెల్మెట్ వినియోగంపై అవగాహన



కోడూరు: వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణాలు చేయాలని ఎస్ఐ శిరీష అన్నారు. బుధవారం స్థానిక వంతెన సెంటర్‌లో హెల్మెట్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి ప్రయాణం చేయడం సురక్షితమని, ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడుతుందని ఎస్ఐ అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే, వారి తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్మెట్ లేని ప్రయాణం కూడా ప్రమాదకరమని, హెల్మెట్ ధరించకపోతే జరిమానా విధిస్తామని ఎస్ఐ స్పష్టం చేశారు. ఏఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌తో నగర ప్రజల ఇక్కట్లు



మచిలీపట్నంటౌన్: నగరంలోని ప్రధాన కూడలి అయిన కోనేరుసెంటర్‌లో బుధవారం ముస్లింల చెస్ట్ బీటింగ్ కార్యక్రమం జరుగుతుండటంతో ఆ ప్రాంతంలోని ట్రాఫిక్‌ను పోలీసులు ఇతర మార్గాలకు మళ్లించారు. మళ్లించిన మార్గాల్లో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు మాత్రం ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఈ మార్గాల్లో ట్రాఫిక్ సమస్య ఎదురై వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. బెల్లంకొట్ల సందులో కూడా ట్రాఫిక్‌ను మళ్లించారు. కానీ ఈ సందులో ఎప్పటిలానే లారీల నుంచి వివిధ రకాల సరుకులను దిగుమతి నిర్వహించారు. దీంతో ఈ మార్గంలో పెద్ద వాహనాలు ఎక్కువ సేపు నిలిచి ఉండటంతో గంటల సేపు ట్రాఫిక్ సమస్య ఎదురైంది. వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ట్రాఫిక్‌ను మళ్లించిన పోలీసులు ఆ మార్గంలో లారీల ద్వారా జరుగుతున్న దిగుమతులను నియంత్రించకపోవటంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యంతో తాము ఇబ్బంది పడాల్సివచ్చిందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎలక్ట్రీషియన్ కుటుంబానికి ఆర్థిక సాయం



దాలిపర్రు(ఘంటసాల): విద్యుదాఘాతంతో ఇటీవల మరణించిన పంచాయతీ ఎలక్ట్రీషియన్ చొప్పర వెంకటేశ్వరరావు కుటుంబానికి మండల పరిషత్ పరిధిలోని ఉద్యోగులు సాయం అందించారు. ఇటీవల దాలిపర్రు పంచాయతీలో వీధిలైట్లు వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై వెంకటేశ్వరరావు మృతి చెందాడు. ఆర్థికంగా వెనకబడిన వెంకటేశ్వరరావు కుటుంబానికి మండలంలోని మండల పరిషత్, గ్రామ పంచాయతీలు, సచివాలయాల ఉద్యోగులు, సిబ్బంది స్పందించి రూ.46 వేల ఆర్థిక సాయాన్ని మృతుడు వెంకటేశ్వరరావు భార్య రాజేశ్వరికి సర్పంచ్ డోకిపర్తి శాంత కుమారి, ఈఓపీఆర్డీ గుత్తికొండ కిషోర్ చేతులు మీదగా బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బోలెం అర్జునరావు, పి.రాంబాబు, చావలి కాంతారావు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు చిన్నం శివతేజ, పిడిగే నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రస్ట్ సాయంతో పంటకాలువలో పూడిక తీత

రూ.2 లక్షలకు పైగా నిధులతో కాలువ పూడికతీత పనులు

పర్రచివర(నాగాయలంక): పంటకాలువ పూడిపోయి సాగునీటి కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు విక్కుర్తి రాఘవయ్య ఛారిటబుల్ ట్రస్ట్ సాయం అందించింది. పంటకాలువలో పూడికతీత పనులకు రూ.2 లక్షలు సాయం అందించగా బుధవారం ఈ పనులను ట్రస్ట్ చైర్మన్, పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు పరిశీలించారు. మండలంలో పెదపాలెం నుంచి సొర్లగొంది వరకు సుమారు ఎనిమిది కిలోమీటర్ల పొడవున పంట కాలువ అటూ ఇటూ రెండు గజాల మేర పూడికపడి సాగునీరు ముందుకు కదలకపోవడంతో ఆయా ప్రాంతాల రైతులు అవనిగడ్డకు చెందిన విక్కుర్తి రాఘవయ్య ఛారిటబుల్ ట్రస్టు ట్రస్ట్ చైర్మన్, పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన విక్కుర్తి రూ.2 లక్షలకు పైగా సొంత నిధులతో ఈ పనులు చేపట్టడానికి ముందుకు వచ్చారు. నాలుగు ప్రొక్లయిన్లతో కొనసాగిస్తున్న పనులను శ్రీనివాసరావు పర్రచివర శివారు భోగాదివారి దిబ్బ, గణపేశ్వరం శివారు దిండి గ్రామం వద్ద పరిశీలించారు. పూర్తిస్థాయిలో మరో ఆయిదారు సంవత్సరాల వరకు కాల్వ పూడిక తీయాల్సిన అవసరం లేకుండా పనులు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

దాత సాయంతో జంగిల్ క్లియరెన్స్

కోడూరు: మండలం పరిధిలోని మెరకగౌడపాలెం-ద్వారకా గ్రామాల మధ్య ప్రధాన రహదారికి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా ముళ్లచెట్లు దట్టంగా పెరిగి కొమ్మలు రహదారిపై ప్రయాణించేవారికి తగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కోడూరుకు చెందిన బచ్చు వెంకటేష్ స్పందించి ముళ్లకంప తొలగించేందుకు పూనుకున్నాడు. సొంత ఖర్చులతో జేసీబీని ఏర్పాటు చేసి రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు చేయించాడు. గ్రామస్తులు, పార్టీల నేతలు వెంకటేష్‌ను అభినందించారు.



భోగాదివారి దిబ్బ కాలువ పూడికతీత పనులు పరిశీలిస్తున్న ట్రస్ట్ చైర్మన్ విక్కుర్తి



జంగిల్ క్లియరెన్స్ పనులను పరిశీలిస్తున్న గ్రామస్తులు

ఆలయాలను దర్శించిన చాగంటి దంపతులు

మచిలీపట్నంటౌన్: ప్రవచన చక్రవర్తి చాగంటి కోటేశ్వరరావు దంపతులు బుధవారం నగరంలోని పలు ఆలయాలను దర్శించారు. నగరంలో రెండు రోజుల పాటు 'నిత్య పూజా విధానము' అనే అంశంపై ప్రసంగించేందుకు మంగళవారం ఇక్కడికి విచ్చేసిన చాగంటి కోటేశ్వరరావు తొలి ఏకాదశి కావటంతో ఆలయాలను సందర్శించారు. నగరంలోని చిలకలపూడి శ్రీ పాండురంగ స్వామి ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) దంపతులతో కలసి దర్శించుకున్నారు. నిజాంపేట బ్రాహ్మణ అగ్రహారంలో శ్రీ కోదండ రామాలయం, త్యాగరాజ నిలయాన్ని చాగంటి దంపతులు దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పేర్నినాని నివాసానికి కూడా చాగంటి దంపతులు విచ్చేశారు. చాగంటి దంపతులకు పూజారులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) చాగంటిని పూల మాలతో సత్కరించారు. పేర్నినాని- జయసుధ దంపతులు, పేర్ని కిట్టు చాంగంటి దంపతులకు పాదాభివందన చేశారు. పేర్ని నాని కుటుంబ సభ్యులతో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు చాగంటి ఆశీర్వచనం పొందారు.



చాగంటి దంపతుల ఆశీర్వచనం పొందుతున్న మాజీ ఎమ్మెల్యే పేర్నినాని దంపతులు, కిట్టు

దాడి ఘటనలో ఇద్దరికి గాయాలు

కె.కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కే.కొత్తపాలెం సెంటర్‌లో కొన్నేళ్ల కిందట వరికుప్పల దగ్ధం విషయమై ఇరువురు వ్యక్తుల మధ్య మాటలు ముదిరి ఘర్షణకు దారితీసింది. చల్లపల్లి సీఐ నాగప్రసాద్ తెలిపిన వివరాల మేరకు..మత్తి రాంప్రసాద్, మత్తి యోగి మరి కొందరు సెంటర్‌లో కూర్చుని ఉన్నారు. కొన్నేళ్ల కిందట వరికుప్పల దగ్ధం విషయమై మాటా మాటా పెరిగింది. దీంతో రాంప్రసాద్‌ను యోగి కర్రతో కొట్టాడు. గాయపడిన రాంప్రసాద్ మోపిదేవి పోలీసులకు ఫిర్యాదు చేసి అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స తీసుకున్నాడు. ఈ విషయం విజయవాడలో ఉన్న రాంప్రసాద్ కుమారుడు శ్రీనివాసరావు తెలుసుకుని గ్రామానికి వచ్చాడు. గొడవకు చందన రంగారావు కారణమని భావించి తండ్రి, కుమారుడు ఇద్దరూ అవనిగడ్డ నుంచి గ్రామానికి వస్తున్న రంగారావుపై బండికోళ్లంక వద్ద కరకట్టపై దారికాచి కొట్టారని తెలిపారు. ఈ దాడిలో రంగారావు తలపై గాయం కావడంతో అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం మెరుగుగానే ఉందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ఈ గొడవలకు ఎలాంటి రాజకీయ కారణాలు లేవని, నిందితుడిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. విచారణ చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా పరస్పరం దాడుల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.



కేసు వివరాలు చెబుతున్న సీఐ నాగప్రసాద్, ఎస్ఐ సత్యనారాయణ

స్తంభాన్ని ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

గూడూరు: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై గూడూరు మండలం రామరాజుపాలెం అడ్డరోడ్డు దగ్గర బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకుగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మచిలీపట్నం పరాసుపేటకు చెందిన టి.బి.వి.ఎస్.సుబ్రహ్మణ్యం (48) నందిగామలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. బంధువుల ఇంట్లో కార్యక్రమం ఉండటంతో నందిగామ నుంచి కారులో బయలుదేరాడు. మార్గమధ్యలో ఉయ్యూరులో బంధువులను ఎక్కించుకుని బందరు వెళ్తున్నాడు. రామరాజుపాలెం అడ్డరోడ్డు దగ్గర రోడ్డు దాటుతున్న గేదెలను తప్పించే క్రమంలో అదుపుతప్పిన కారు, గేదెల పక్కన నడిచి వస్తున్న గొరిపర్తి కృష్ణమూర్తిని ఢీకొని విద్యుత్ స్తంభానికి గుద్దుకుని ఆడిపోయింది. ఈప్రమాదంలో కృష్ణమూర్తికి స్వల్పగాయాలవగా, కారు నడుపుతున్న సుబ్రహ్మణ్యం తలకు బలమైన గాయాలయ్యాయి. 108లో సుబ్రహ్మణ్యంను బందరు ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో కారులో సుబ్రహ్మణ్యం మరదలు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరు సురక్షితంగా బయటపడ్డారు.



గాయపడిన సుబ్రహ్మణ్యం



రామరాజుపాలెం అడ్డరోడ్డు దగ్గర అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి

అవనిగడ్డ: ఈ నెల 18 నుంచి మొదలయ్యే జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జనసైనికులందరూ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ నాలుగో విడత సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అవనిగడ్డ నియోజకవర్గం నుంచి అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసి మరోసారి కృష్ణా జిల్లాలో అవనిగడ్డ నియోజకవర్గాన్ని మొదటిస్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు పార్టీ నియమించిన క్రియాశీలక వలంటీర్ల ద్వారా సభ్యత్వ నమోదు జరుగుతుందని తెలిపారు.

అరటి ఉత్పత్తులతో బహుళ ప్రయోజనాలు

గన్నవరం రూరల్: అరటి ఉత్పత్తులతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఎలీప్(అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్ ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా) చైర్‌పర్సన్ కె.కనకదుర్గ చెప్పారు. సూరంపల్లి మహిళా పారిశ్రామిక వాడలో అరటి ఆహార ఉత్పత్తులపై వారం రోజుల పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. అరటిపండు, కాయ, నార, ఆకులు అన్ని ఉపయోగపడతాయని చెప్పారు. ఆహార ఉత్పత్తులుగా ఉండే వీటన్నింటిని ఉపయోగించి లాభసాటిగా పరిశ్రమను నడుపుకోవాలన్నారు. మార్కెట్ చేసుకోవాలని సూచించారు. చిన్న తరహా పరిశ్రమలు ఎంతో ఆర్థిక వృద్ధిని సాధిస్తాయని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న 37 మందికి ఆమె సర్టిఫికెట్లు అందజేశారు. రీజినల్ మేనేజర్ వి.సునీత, ఎలీప్ సభ్యులు పాల్గొన్నారు.



సూరంపల్లి ఎలీప్‌లో శిక్షణ పొందిన వారితో చైర్‌పర్సన్ కనకదుర్గ

ప్రకటన